ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు - 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు - 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు - 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్లగడ్డ, బనగానపల్లె - 9985411377



శ్రీశైలం జలాశయంలో గేట్లకు దిగువ భాగాన ఉన్న నీరు

# జలాశయాలు వెలవెల..!

ఏటా ఖరీఫ్ సీజన్‌లో నిండుకుండలను తలపించే జలాశయాలు నీరు లేక వెలవెలబోతున్నాయి. ప్రమాదకర స్థాయికి నీటి నిల్వలు పడిపోయాయి. నైరుతి రుతుపవనాలు ఆశాజనకంగా ప్రవేశించినా.. ఆ తరువాత మేఘాలు దోబూచులాడుతున్నాయి. రాయలసీమ జిల్లాలకు ప్రాణాధారమైన కృష్ణా, తుంగభద్ర నదులకు వరద జాడ లేదు. కరువు పల్లెసీమలకు సాగు, తాగునీటికి కీలకమైన కృష్ణా, తుంగభద్ర జలాశయాలు అడుగంటాయి. ఈ జలాశయాలకు ఈ ఏడాది ఇప్పటి వరకు ఆశాజనకంగా వరద చేరలేదు. జూలైలో అడుగు పెడుతున్నా.. సీమ పల్లెసీమలకు జీవనాడులైన శ్రీశైలం, తుంగభద్ర జలాశయాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వరద నీరు చేరకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- వర్షాకాలం సీజన్ ప్రారంభమైనా కృష్ణా, తుంగభద్ర నదుల్లో కానిరాని వరద
- అడుగంటిన శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలు
- పల్లెసీమల్లో తాగునీటికి తప్పని అవస్థలు
- రాయలసీమ అన్నదాతల్లో ఆందోళన

**కర్నూలు, జూలై 3 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో సాగు, తాగునీటి ప్రయోజనాలను కాపాడే ప్రధాన జలాశయాలు శ్రీశైలం, తుంగభద్ర, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 682.49 టీఎంసీలు. ఆదివారం నాటికి ఆయా డ్యాంలో ఉన్న నీటి నిల్వలు 168.32 టీఎంసీలే. 514.17 టీఎంసీలు ఖాళీగా ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయంలో 217.88 టీఎంసీలు ఉన్నాయి. ఈ లెక్కన చూసినా 49.54 టీఎంసీలు తక్కువగానే ఉన్నాయి. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో చిన్నా పెద్ద జలాశయాల సామర్థ్యం 441.66 టీఎంసీలు కాగా ప్రస్తుతం 71.36 టీఎంసీలే ఉన్నాయి. అందులో డెడ్ స్టోరేజీ పోనూ 41.64 టీఎంసీలే వినియోగించుకునే అవకాశం (లైవ్ స్టోరేజ్ కెపాసిటీ) ఉందని ఇంజనీర్లు అంటున్నారు. గతేడాది ఇదే సమయంలో 195.09 టీఎంసీలు నిల్వ ఉండేది. జూన్ ఒకటో తారీఖు నుంచి మే 31 వరకు ఒక నీటి సంవత్సరంగా పరిగణిస్తారు. వర్షాకాలం సీజన్ ప్రారంభంకాగానే ప్రాజెక్టుల్లోకి వరద మొదలవుతుంది. ఆయా ప్రాజెక్టుల ఆధారంగా పంట కాలువ కింద ఆయకట్టు రైతులు జూలై మొదటి వారంలో వరి నారు పెంచేందుకు సర్వం సిద్ధం అవుతారు. అయితే.. ఈ ఏడాది జలాశయాలకు వరద మొదలే కాకపోవడం.. వేసవి పరిస్థితులను తలపిస్తుండడం.. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో వెలవెలబోతున్న తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలను చూసిన మట్టిమనుషులు ఆందోళన చెందుతున్నారు.

## సీమలో ఇది పరిస్థితి

రాయలసీమ జిల్లాల్లో జలాశయాలు అడుగంటడంతో తాగునీటిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కర్నూలు జిల్లాలో 7.077 టీఎంసీలు సామర్థ్యం కలిగిన నాలుగు (గాజులదిన్నె ప్రాజెక్టు, సుంకేసుల బ్యారేజ్, కృష్ణగిరి, పత్తికొండ) జలాశయాలు ఉన్నాయి. ఆదివారం ఉన్న నీరు 2.973 టీఎంసీలే. నంద్యాల జిల్లాలో 37.163 టీఎంసీలు సామర్థ్యం కలిగిన ఆరు జలాశయాలు (గోరుకల్లు, అవుకు, వెలుగోడు, వరదరాజస్వామి ప్రాజెక్టు, జుర్రేరు, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు) ఉంటే.. నీటి నిల్వ 3.955 టీఎంసీలే. కడప జిల్లాలో 77 టీఎంసీలు సామర్థ్యం కలిగిన 11 రిజర్వాయర్లు ఉంటే ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో 48.584 టీఎంసీలు ఉంటే ప్రస్తుతం 13.545 టీఎంసీలే ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 12.563 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఐదు జలాశయాలు ఉంటే ప్రస్తుతం 2.033 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. సత్యసాయి జిల్లాలో 16.071 టీఎంసీలు సామర్థ్యం కలిగిన ఆరు జలాశయాలు ఉంటే తాజాగా 1.581 టీఎంసీలు, అన్నమయ్య జిల్లాలో 8.165 టీఎంసీలు సామర్థ్యంతో ఐదు జలాశయాలు ఉంటే ప్రస్తుతం 3.128 టీఎంసీలే ఉన్నాయి. తిరుపతి జిల్లాలో 3.038 టీఎంసీలు సామర్థ్యం కలిగిన నాలుగు జలాశయాలు ఉంటే.. ఆదివారం నాటికి ఉన్న నీటి నిల్వలు 1.060 టీఎంసీలే. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. 15-16 శాతం కూడా నీటి నిల్వలు లేకపోవడం చూస్తే కష్టజీవులకు కన్నీటి కష్టాలు తప్పవా..? అని సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తాగునీటిపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సీమ కరువు క'న్నీటి' కష్టాలు తీరేనా..?


ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలకు జీవనాడి అయిన తుంగభద్ర జలాశయంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు. అయితే.. టూ ఫిల్లింగ్ ఆధారంగా ఒక నీటి సంవత్సరంలో 212 టీఎంసీల వరదను వినియోగించుకునేలా ప్రాజెక్టు డిజైన్ చేశారు. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), ఎగువ కాలువ (హెచ్చెల్సీ) సహా కర్ణాటక కాలువలు, తెలంగాణలో ఆర్డీఎస్ కాలువకు కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్-1 (కేడబ్ల్యుడీటీ) బచావత్ అవార్డు ప్రకారం కేటాయింపులు చేశారు. ప్రతి యేడాది మే నెలలో టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశమైన ఆ నీటి సంవత్సరంలో డ్యాంలో చేరే వరదను అంచనా వేస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది (2024-24 నీటి సంవత్సరం) 172 టీఎంసీలు వరద చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీకి 24 టీఎంసీలకు గానూ 19.472 టీఎంసీలు, కేసీ కాలువకు 10 టీఎంసీలకు గానూ 8.113 టీఎంసీలు, అనంతపురం జిల్లాలో హెచ్ఎల్‌సీకి 35.50 టీఎంసీలకు గానూ 26.368 టీఎంసీలు కేటాయించారు. డ్యాంలో వరద చేరికను బట్టి జూలై 15న కాలువలకు సాగునీరు విడుదల చేసేలా జూన్ 7న జరిగిన టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీలో తీర్మానం చేశారు. ప్రస్తుతం తుంగభద్రలో 105.79 టీఎంసీలకు గానూ 5.79 టీఎంసీలే నిల్వ ఉన్నాయి. ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అనుకున్న సమయానికి తగినంత వరద రాకపోతే తాగు, సాగునీటిపై ప్రతికూల ప్రభావం పడుతుందని సీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

## అడుగంటిన శ్రీశైలం

శ్రీశైలం జలాశయం నీటి నిల్వలు అత్యంత దయనీయ స్థితికి చేరుకున్నాయి. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు.. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 215.810 టీఎంసీలు. అయితే.. ప్రస్తుతం 37.35 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. వర్షాకాలం సీజన్ ఆరంభమైనా ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో వర్షాలు కురవకపోవడం వల్ల డ్యాంకు వరద మొదలు కాలేదు. ఖరీఫ్ ప్రారంభంలో నైరుతి రుతుపవనాలు ఆలస్యమై సకాలంలో వర్షాలు పడకపోయినా, దుర్భిక్ష పరిస్థితులు తలెత్తితే ప్రజలకు కనీస తాగునీటి అవసరాలు తీర్చేందుకు, నారుమడులకు నీటి విడుదల కోసం నీటి సంవత్సరం చివరలో (మే నెల) క్యారీ ఓవర్ కింద శ్రీశైలం జలాశయంలో కనీస నీటి మట్టం 854 అడుగులకు తగ్గకుండా క్యారీ ఓవర్ కింద 60 టీఎంసీలు నిల్వ ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. తాజా పరిస్థితిపై సీమ రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో గతేడాది 33.44 టీఎంసీల నీరు నిల్వ ఉండేదని ఇంజనీర్లు తెలిపారు.



సంగమేశ్వరం వద్ద ఇలా..



తుంగభద్ర జలాశయం

## సాగునీటి ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్ష



ఇరిగేషన్ అధికారులతో ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న కలెక్టరు

**కర్నూలు, జూలై 3 (ఆంధ్రజ్యోతి)/ కర్నూలు కలెక్టరేట్:** 'జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల వారిగా ఎలాంటి సమస్యలు ఉన్నాయి. నిధులు, ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా..? అంతర్ రాష్ట్ర సమస్యలు ఉన్న ప్రాజెక్టులు ఏవీ..? సమగ్ర వివరాలతో కూడిన నివేదికలతో రండి' అంటూ జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సాగునీటి ప్రాజెక్టు, గ్రామీణ తాగునీటి విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ కర్నూలు సర్కిల్ ఇన్‌చార్జి (ఎఫ్ఏసీ) ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి జిల్లాలోని ప్రాజెక్టుల గురించి వివరించారు. ఎల్లెల్సీ ద్వారా జిల్లాలో 1,51,134 ఎకరాలకు సాగునీరు, 194 గ్రామాలకు తాగునీరు ఇస్తున్నామని వివరించారు. టీబీపీ ఎల్లెల్సీ, ఆలూరు బ్రాంచి కెనాల్, కేసీ కాలువ, హంద్రీనీవా కాలువ, సుంకేసుల జలాశయం, గాజులదిన్నె ప్రాజెక్టు సహా గత వైసీపీ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టుల గుర్తించి కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. గూగుల్ మ్యాప్ ద్వారా వాటిని పరిశీలించారు. ఆయా ప్రాజెక్టు తాజా పరిస్థితులపై ఇంజనీర్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టరు రంజిత్‌భాషా మాట్లాడుతూ 'సంక్షిప్త సమాచారం కాదు.. సమగ్ర వివరాలతో పూర్తి నివేదికలు కావాలని, తక్షణమే నివేదికలు తయారు చేయాలని' ఆదేశించారు. త్వరలోనే ఐఏబీ సమావేశం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేయాలని సూచించారు. అదే క్రమంలో ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య రాకుండా చూడాలని, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూస్ ఇంజనీర్లు సమన్వయంతో పని చేస్తే గ్రామాల్లో తాగునీటి సమస్యలే రావని అన్నారు. అదే క్రమంలో తాగునీటి పథకాలు, ఇరిగేషన్ సోర్స్ వివరాలు, మ్యాప్‌లతో నివేదికలు తయారు చేయాలని ఆ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు పాల్గొన్నారు.

## ఉప లోకాయుక్త ఆదేశాలతో ఒంగోలు మున్సిపల్ అధికారులపై చర్యలు

**కర్నూలు(లీగల్), జూలై 3:** నిబంధనలకు విరుద్ధంగా కొన్ని బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్‌ను అక్రమంగా ఆమోదించారనే ఫిర్యాదుపై రాష్ట్ర ఉప లోకాయుక్త ఆదేశాలతో అధికారులు చర్యలు తీసుకున్నారు. లోకాయుక్త ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఒంగోలుకు చెందిన ఇద్దరు మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకుంది. ఒంగోలు మున్సిపల్ అధికారులు నిబంధనలను ఖాతరు చేయకుండా అక్రమంగా కొన్ని బిల్డింగ్ ప్లాన్‌లను ఆమోదించారంటూ ఒంగోలు చెందిన ఒక మాజీ సైనిక ఉద్యోగి పత్తిపాటి రామమూర్తి 2016లో రాష్ట్ర ఉప లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఉప లోకాయుక్త వెంటనే విచారించి తుది నివేదికను దాఖలు చేయాలని రాష్ట్ర మున్సిపల్ అధికారులకు గతంలో ఆదేశించింది. దీంతో రాష్ట్ర స్థాయి మున్సిపల్ అధికారులు విచారించి బిల్డింగ్ ప్లాన్‌లను ఆమోదించడంలో బాధ్యులైన విశ్రాంత సీడీపీవో జి.శేషాచారీ, ఇన్‌చార్జి సీపీడీవో ఎం.నారాయణరావులపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిపై ఒక వార్షిక ఇంక్రిమెంటుతో పాటు మూడు సంవత్సరాల పాటు వీరి పెన్షన్‌లో రెండున్నర శాతం కోత విధించింది. అధికారుల చర్యలతో ఫిర్యాదును ముగిస్తూ రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

**● తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ల ఇంక్రిమెంటు కట్**

నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ డాక్యుమెంట్లను, వెబ్‌ల్యాండ్ వివరాలను అప్పటి కృష్ణా జిల్లా గన్నవరం తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్లు మార్పులు చేర్పులు చేశారనే ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరి ఇంక్రిమెంట్లలో కోత విధించినట్లు ఉప లోకాయుక్తకు తెలిపింది. అప్పటి గన్నవరం తహసీల్దార్ ములుగు మాధురి, సబ్ రిజిస్ట్రార్ బి.సాయికృష్ణారెడ్డిలపై గన్నవరం చెందిన మాజీ సైనికోద్యోగి ముప్పనేని రవికుమార్ రాష్ట్ర ఉప లోకాయుక్తకు 2016లో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఫిర్యాదిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఉప లోకాయుక్త రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు విచారించి అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్ ములుగు మాధురికి రెండు ఇంక్రిమెంట్లు, సబ్ రిజిస్ట్రార్ బి.సాయికృష్ణారెడ్డికి ఒక ఇంక్రిమెంటును ఒక ఏడాదిపాటు కోత విధించినట్లు ఉప లోకాయుక్తకు తెలిపింది.

## మంత్రిని కలిసిన కలెక్టర్

3
నంద్యాల
(నూనెపల్లె) 6:మంత్రి
ఫరూక్‌ను కలిసిన కలెక్టర్ రాజకుమారి
మంత్రి ఫరూక్‌ను కలిసిన కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల (నూనెపల్లె), జూలై 3:** నంద్యాల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ఎ కలెక్టర్ రాజకుమారి మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో బుధవారం



నంద్యాల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజకుమారి మంత్రి ఫరూక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, కింది స్థాయి అధికారులను సమన్వయం చేసుకుని చక్కటి పరిపాలన అందించాలని సూచించారు.

## నంద్యాల మున్సిపాలిటీ అభివృద్ధిపై చర్చ



అమరావతిలో మంత్రి ఫరూక్‌తో భేటి అయిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

**నంద్యాల (నూనెపల్లె), జూలై 3:** నంద్యాల మున్సిపాలిటీ అభివృద్ధిపై రాష్ట్రమంత్రులు ఎన్ఎండీ ఫరూక్, నారాయణ చర్చించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం అమరావతిలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ఆయన పేషీలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కలిశారు. నంద్యాల మున్సిపాలిటీని ఏవిధంగా అభివృద్ధి చేయాలని చర్చించినట్లు ఫరూక్ తెలిపారు. గత వైసీపీ పాలనలో మున్సిపాలిటీని అస్తవ్యస్తం చేశారని, నంద్యాల మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా తీర్చి దిద్దే బాధ్యత తనదని ఫరూక్ అన్నారు.

## ఈవో ఆకస్మిక తనిఖీ

- ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు
- ముగ్గురు ఏజన్సీ ఉద్యోగులను విధుల నుండి తొలగింపు



ప్రసాదాల కౌంటర్‌ను తనిఖీ చేస్తున్న ఈవో

**మహానంది, జూలై 3:** మహానంది ఆలయంలో ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఇందులో ప్రసాదాల విక్రయశాలలో 304 లడ్డు ప్రసాదాలు తక్కువ ఉండటంతో పాటు రూ.4,190 నగదు తక్కువ ఉండటం గుర్తించారు. ఇందుకు బాధ్యులుగా అక్కడ విధులు నిర్వహించే రికార్డు అసిస్టెం ట్ మహేశ్వరమ్మ, అటెండర్ కర్ణా బహదూర్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు ఈవో చెప్పారు. అలాగే ఆలయం ప్రాంగణంలో ని సేవ దర్శనం టిక్కెట్ల విక్రయాల కౌంటర్‌ల వద్ద ఏజెన్సీ ప్రతిపాదికన విధులు నిర్వహించే చింతలయ్య, ప్రహ్లాదుడు, మహేష్ విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లు ఈవో తనిఖీలో బయట పడిందన్నారు. ఇందుకు ముగ్గురు ఏజ న్సీ ఉద్యోగులను విధుల నుండి తొలగిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఇటీవలనే ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగులపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో అవినీతి ఉద్యోగుల్లో అలజడి మెదలైంది. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సాగునీటి రంగ అభివృద్ధికి కృషి చేయాలి..

- తెలుగు రాష్ట్రాల సీఎంలకు ఈ-మెయిల్ ద్వారా లేఖ..
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



**నంద్యాల టౌన్, జూలై 3 :** రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని వెనుకబడిన రాయలసీమ, దక్షిణ తెలంగాణా ప్రాంతాల సాగునీటి రంగ అభివృద్ధికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కృషి చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. బుధవారం నంద్యాలలోని సాగునీటి సాధన సమితి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ పునర్విభజన జరిగి పది సంవత్సరాలైనా అనేక అంశాలు అపరిష్కృతంగా ఉండి పోయాయని, ఈ నేపథ్యంలో వాటి పరిష్కారానికి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ చేయడం, దానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించడం అభినందనీయం అన్నారు. విభజన చట్టంలో ఇరు రాష్ట్రాల మధ్య పరిష్కారం కాని సమస్యలపై ఈనెల 6వ తేదీన తెలుగు రాష్ట్రాల సీఎంలు సమావేశం కానున్న నేపథ్యంలో రాయలసీమ సాగునీటి అంశాలను పరిష్కరించాలని ఈ-మెయిల్ ద్వారా సీఎంలకు లేఖను పంపామని తెలిపారు. ఉమ్మడి ఏపీలో సాగునీటి రంగంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రాంతాలైన రాయలసీమ, దక్షిణ తెలంగాణ ప్రాంతం విభజన అనంతరం కూడా విభజన అంశాల పరిష్కారంలో జాప్యం వల్ల తీవ్రంగా నష్టపోతున్నదని ఆయన అన్నారు. విభజన చట్టం సెక్షన్ -89ఏ ప్రకారం ప్రాజెక్టుల వారీగా నీరు కేటాయించాల్సి ఉందని అన్నారు. రాజ్యాంగబద్ధమైన ప్రాజెక్టుల వారీగా సాగునీటి హక్కుల మార్పు, తదితర అంశాలపై రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు శాశ్వత పరిష్కారం వైపు అడుగులు వేయాలని కోరారు.

# దేవమ్మ మడుగుకు గడ్డుకాలం..!



పొలాల మీదుగా వెళ్తున్న తెలంగాణ ట్రాక్టర్లు

- తుంగభద్రలోకి తెలంగాణరాష్ట్ర ఇసుక ట్రాక్టర్లు
- రెండు నెలలుగా కొనసాగుతున్న అక్రమ రవాణా
- 11 ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఎదురూరు రైతులు
- ఇసుక తవ్వకాలు అరికట్టకపోతే కర్నూలుకు తాగునీరు కష్టమే



తుంగభద్రలో పట్టుబడిన తెలంగాణ ఇసుక ట్రాక్టర్లతో పోలీసులు


**కర్నూలు(రూరల్), జూలై 3:** కష్టకాలంలో కర్నూలును ఆదుకొనే దేవమ్మ మడుగు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. అక్రమార్కులు తుంగభద్ర నదిలోని దేవమ్మ మడుగులో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. బుధవారం కర్నూలు రూరల్ మండలం ఎదురూరు గ్రామ పొలిమేరలో ఉన్న తుంగభద్రనదిలోకి వెళ్ళి ఏపీ హద్దులు దాటి అక్రమంగా ఇసుకను తీసుకెళ్తున్న గద్వాల జిల్లా మద్దూరు గ్రామానికి చెందిన 16 ట్రాక్టర్లను ఎదురూరు రైతులు పట్టుకున్నారు. అందులో ఆరు ట్రాక్టర్లను డ్రైవర్లు అవతలివైపుకు తీసుకెళ్లారు. మిగిలిన 11 ట్రాక్టర్లును తాలుకా పోలీసులకు, మైనింగ్‌శాఖ అధికారులకు పట్టుకున్నారు. 11ట్రాక్టర్లను సీజ్‌చేసి పోలీసులు కర్నూలుకు తీసుకొచ్చారు. వారం క్రితం కూడా తెలంగాణరాష్ట్రం, రాజోలి, తూర్పు గార్లపాడుకు చెందిన ట్రాక్టర్లు కర్నూలు జిల్లా సరిహద్దులోకి వచ్చి ఇసుక తీసుకెళ్లుతూ పట్టుబడ్డాయి. రెండు నెలలుగా తెలంగాణలోని మనోపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన ఇసుక అక్రమార్కులు ఇసుక దందా కొనసాగిస్తున్నారు. ప్రతి రోజూ ఒక్కొక్క ట్రాక్టర్ 5నుంచి 8 ట్రిప్పుల దాకా ఏపీ సరిహద్దుల్లోకి వచ్చి ఇసుకను తీసుకెళ్ళి అవతలి వడ్డుపై డంప్ చేసి అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక ట్రాక్టర్ ట్రిప్పు ఇసుకను రూ.5వేలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

### ● అక్రమ ఇసుక నియంత్రణకు ఏళ్ల తరబడి విష్ణు పోరాటం



కర్నూలు జిల్లాతో పాటు, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు రైతుల సాగునీరు, తాగునీటి అవసరాల కోసం తుంగభద్ర నదిలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నారు. అనేకసార్లు ప్రభుత్వాలకు, కలెక్టర్లకు అక్రమ ఇసుక రవాణాను అరికట్టి నీటివనరులను కాపాడాలని విజ్ఞాపన పత్రాలు ఇచ్చారు. అంతేకాకుండా హైకోర్టులో నుంచి స్టే ఆర్డర్ తీసుకొచ్చారు. అయినా ఇసుక అక్రమ రవాణా ఆగలేదని స్థానికులు చెబుతున్నారు.





అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఐ పీరయ్య

### అక్రమంగా ఇసుక తీసుకెళ్లితే చర్యలు



తంగభద్ర నదిలోంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో లాగా జరిమానా విధించి వదిలేయడం ఇక ఉండదు.

– మురహరి, రాయలీ, ఇన్‌స్పెక్టర్, మైనింగ్‌శాఖ, కర్నూలు

### చట్టపరమైన చర్యలు తీసుకుంటాం



ఇప్పటి వరకు 11 ట్రాక్టర్లను సీజ్ చేశాం. మరో ఆరు ట్రాక్టర్లు తప్పించుకున్నాయి. వాటి నెంబర్ల సహాయంతో కర్నూలు తాలుక పోలీస్‌స్టేషన్‌కు రప్పించి చర్యలు తీసుకుంటాం.

– పీరయ్య, ఎస్ఐ, కర్నూలు తాలుకా

## జిల్లా పరిషత్‌లో పదోన్నతులు



పదోన్నతి పొంది ఉద్యోగులతో జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి,సీఈఓ నాసరరెడ్డి

**కర్నూలు(న్యూసిటీ), జూలై 3:** జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా పదోన్నతి పొందిన ఉద్యోగులు నియామక ఉత్తర్వులు అందుకున్నారు. సంజామల మండలం నొస్సం జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌కు జిల్లా పరిషత్ పరిపాలన భవనం సీనియర్ అసిస్టెంట్‌గా, ఆళ్లగడ్డ పీఆర్ఐ సబ్ డివిజన్‌లో పని చేస్తున్న టైపిస్టు ఎస్. సుమతకు జిల్లా పరిషత్ పరిపాలన భవనం సీనియర్ అసిస్టెంట్‌గా, కర్నూలు పీఆర్ఐ డివిజన్ కార్యాలయంలో టైపిస్టుగా పని చేస్తున్న నాగేశ్వరరెడ్డికి బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, అవుకు ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న టైపిస్టు డి. బాబుప్రసాద్‌కు ఆళ్లగడ్డ పీఆర్ఐ సబ్ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## పిన్నెల్లిని జగన్ కలవడమా..?: సోమిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

**కర్నూలు(అర్బన్), జూలై 3:** సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలను ధ్వంసం చేసిన పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డిని నెల్లూరు జైలులో జగన్మోహన్‌రెడ్డి కలిసేందుకు వెళ్తానడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలోని తన చాంబర్లో మాట్లాడుతూ మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి తనకు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేస్తున్నారని గ్రహించి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఈవీఎంలను ధ్వంసం చేయడంతో ఎన్నికల కమిషన్ కేసులు నమోదు చేసిందన్నారు. ఆయన అరెస్టయి జైల్లో ఉండగా.. 5 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన వైస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జైలులో ఉన్న పిన్నెల్లిని పరామర్శించేందుకు వెళ్తానని ఆయన నైజాన్ని తెలియజేస్తోందని అన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, రాష్ట్ర క్రిష్టియన్ సెల్ ఉపాధ్యక్షుడు ఏవైఎస్ బాబు రాజు, ఎస్సీ సెల్ కార్యదర్శి పేరపోగు చిన్న మారెన్న పాల్గొన్నారు.

## ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్‌గా పుష్పకుమార్



డైరెక్టర్ పుష్పకుమార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

**కర్నూలు(న్యూసిటీ), జూలై 3:** కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్‌గా కే. పుష్పకుమార్ నియమితులయ్యారు. బుధవారం శిక్షణ కార్యాలయంలో ఆయనను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. గతంలో ఎస్ఆర్ పేట బ్రాంచు మేనేజర్‌గా పని చేస్తున్న అతనికి బదిలీ చేసి సంస్థ డైరెక్టర్‌గా నియమించారు. ఈ సందర్భంగా పుష్పకుమార్ మాట్లాడుతూ యువతీ, యువతులకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు కింద పడి ఇద్దరు వ్యక్తులు మృతి

**నంద్యాల (నూనెపల్లె), జూలై 3:** నంద్యాల మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మూల సాగరం రైల్వే గేట్ సమీపంలో ప్రయాణిస్తున్న రైలులో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు బుధవారం తెలిపారు. ఘటనా స్థలానికి రైల్వే ఎస్ఐ జలీల్, త్రీటౌన్ సీఐ నరసింహులు, సిబ్బంది చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతులలో ఒకరికి 55 సంవత్సరాలు, మరొకరికి 35 సంవత్సరాలు ఉంటాయన్నారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి గదికి తరలించారు. కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు రైల్వే ఎస్ఐ జలీల్ తెలిపారు.

## రైలు నుంచి జారిపడి బీటెక్ విద్యార్థి మృతి

**పాణ్యం, జూలై 3:** స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని గాలేరు, నగరి వద్ద రైలు నుంచి జారిపడి బీటెక్ విద్యార్థి సునీల్‌కుమార్‌రెడ్డి మృతి చెందాడు. ప్రకాశం జిల్లా కంభం పట్టణం కాప వీధికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, కృష్ణవేణి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారు హైదరాబాదులోని ఉప్పల్ సమీపంలోని చిలకలనగర్‌లో నివాసముంటున్నారు. వెంకటేశ్వరరెడ్డి వాచ్‌మెన్‌గా ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. సునీల్‌కుమార్‌రెడ్డి హైదరాబాదులోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి బుధవారం స్వగ్రామానికి కాచిగూడ, గుంటూరు రైలులో వస్తూ పాణ్యం సమీపం లో తెల్లవారుజామున రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ ఖలీల్ తెలిపారు.

## వైసీపీ ఆదోని పట్టణాధ్యక్షుడిపై కేసు నమోదు

**ఆదోని, జూలై 3:** ఆదోని పట్టణ అధ్యక్షుడు దేవాతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ నరసింహరాజు తెలిపారు. సీఐ తెలిపిన మేరకు వివరాలు... ఆదోని పట్టణానికి చెందిన ఓ వివాహితను చిరంజీవి అనే వ్యక్తి వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెను తీసుకెళ్లిపోయాడు. 2024 మే 30వ తేదీన ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. సదరు వివాహితను తీసుకెళ్లిన సమయంలో చిరంజీవికి వైసీపీ పట్టణ అధ్యక్షుడు దేవాతో పాటు రామాంజి సహకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి సహకారంతోనే తన భార్యను తీసుకెళ్లారని బాధితుడు సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేయాలని త్రీటౌన్ పోలీసులను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

# కేఎంసీ డీఈఈ నిర్వాకం

- సొంతింటికి 24 గంటల సరఫరా తాగునీటి పైప్‌లైన్
- కార్పొరేషన్ సొమ్ము రూ. లక్ష ఖర్చు
- చోద్యం చూస్తున్న అధికారులు

**కర్నూలు(న్యూసిటీ), జూలై 3:** ఈ అధికారికి నగర ప్రజల అవసరాల కంటే సొంత అవసరాలే ముఖ్యమయ్యాయి. నగర పాలక సంస్థలోని అనేక కాలనీల్లో తాగునీటి వసతి సరిగా లేనప్పటికీ సదరు డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తన ఇంటికి 24 గంటలు నీరు సరఫరా చేసుకోడానికి ఏర్పాటు చేసుకున్నాడు. ఇదేదో రహస్యంగా కాదు. ఉన్నతాధికారులకు కూడా తెలుసు. అయినా ఎవ్వరూ పట్టించుకోలేదు. చివరాఖరికి ఎమ్మెల్యే దగ్గరికి ఈ వ్యవహారం వెళ్లినట్లు తెలుస్తోంది. ఏమవుతుందో చూడాలి.

నగర సంస్థ కార్యాలయంలోని ఓ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిర్వాకం చూస్తే ప్రతి ఒక్కరూ ముక్కున వేలేసుకుంటున్నారు. అన్యాయాన్ని అరికట్టాల్సిన అధికారి తన ఇంటికి 24 గంటలు తాగు నీరు సరఫరా కావడానికి కార్పొరేషన్ నిధులతో పైప్‌లైన్ అమర్చుకున్నారు. ఇదంతా తెలిసిన కూడ అధికారులు మిన్నకుండి పోవడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. శివారు కాలనీలలోని తాగునీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాల్సిన కార్పొరేషన్ అధికారులే ఇంత బరితెగింపునకు దిగారు. ఈ విషయంపై ఓ ఎమ్మెల్యే వద్ద పంచాయితీ కూడా జరిగింది. ఆ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. చివరికి ఆ పైప్‌లైన్‌ను తొలగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ముందుగానే అడ్డుకోవాల్సిన అధికారులు ఎమ్మెల్యే సహా అందరి దృష్టికి వెళ్లాకే పైప్‌లైన్ ఎందుకు తొలగిస్తున్నారనేది చర్చనీయాంశమైంది.



పనులు చేస్తున్న కార్పొరేషన్ కార్మికులు

### ● రూ.లక్ష కార్పొరేషన్ నిధులతో..

అధికారి నగర పాలక సంస్థ నిదులు రూ.లక్ష ఖర్చుచేసి ఈ అధికారి తన ఇంటికి సుమారు వందమీటర్ల పొడవున లైన్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. దీనికి కార్పొరేషన్ కార్మికులతో పని చేయించుకున్నాడు. శివారు కాలనీలలో రోడ్లు..డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయాలంటే స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ సమావేశంలో తీర్మానం అవసరం అవుతాయి. మరి ఏ తీర్మానాలు లేకుండా ఇంత అధికార దుర్వినియోగం ఎలా జరిగిందనే చర్చ తీవ్రస్థాయిలో జరుగుతోంది.

### ● మంత్రి పేరుతో బెదిరింపులు..

జిల్లాలోని ఓ మంత్రి పేరు చెప్పుకుని సదరు అధికారి అందరినీ బెదిరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యాక బదిలీ తప్పదని భావించిన అధికారి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసాడు. తనకు బదిలీ జరగదని, మంత్రి అండదండలు ఉన్నాయని గొప్పలు చెపుకుంటున్నట్లు వినికిడి. అంతే కాకుండా కొందరు కాంట్రాక్టర్లు, అధికారులను బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



పైప్‌లైన్ కోసం తవ్విన గుంత

### ● అనవసరంగా బురదచల్లుతున్నారు..

నాపై అనవసరంగా బురదచల్లుతున్నారు. నా ఇంటి మీద నుంచి సుమారు 25 ఇళ్లకు పైప్‌లైన్ వెళ్తుంది. కొందరు కావాలనే నన్ను ఇరికించేందుకు నిరాధార ఆరోపణలు చేస్తున్నారు.

.గోపాలక్రిష్ణ, డీఈఈ, నగర పాలక సంస్థ, కర్నూలు

# హత్య కేసులో నిందితుల అరెస్టు

**నంద్యాల, జూలై 3(ఆంధ్రజ్యోతి):** ఆళ్లగడ్డ పట్టణంలోని పాతూరు వీధిలో నివాసం ఉంటున్న అట్ల భాస్కరరెడ్డి భార్య, టీడీపీ కార్యకర్త శ్రీదేవి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డిఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 25వ తేదీన నంద్యాలలో భాస్కరరెడ్డికి డయాలసిస్ చేయించుకొని ఇంటికి రాగానే కాంపౌండు వద్ద శ్రీదేవి మరిది వేణుగోపాలరెడ్డి, అతని భార్య శిరీష, రాకేష్, దేవేంద్ర కుమార్, శేఖర్ సింగ్, నరేష్ కళ్లలో కారంపొడి చల్లి ఇనుపరాడ్లు, కట్టెలతో దాడి చేశారని తెలిపారు. ఇందులో భాస్కరరెడ్డి రెండు కాళ్లపై రక్త గాయాలయ్యాయని, శ్రీదేవికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందిందని డిఎస్పీ చెప్పారు. నిందితులపై 302,307,324,120(బి) ఆర్/డబ్ల్యు 34 సెక్షన్ల కింద పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. గత 20 సంవత్సరాల నుంచి వీరి మధ్య ఆస్తి తగాదాలు ఉండటమే హత్యకు కారణమని అన్నారు. నిందితులను పట్టణంలోని రామలక్ష్మి కొట్టాల సమీపంలో అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో ఏవీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు, అతని అనుచరులు ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. నిందితుల నుంచి రెండు బైకులు, కర్ర, 5 ఇనుప రాడ్లు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించారని డిఎస్పీ షర్ఫుద్దీన్ వివరించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీదేవి హత్య కేసులో నిందితులను చూపిస్తున్న డిఎస్పీ షర్ఫుద్దీన్

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**నందికొట్కూరు రూరల్ జూలై 3 :** నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కేజీ రహదారిపై ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో బ్రాహ్మణకొట్కూరుకు చెందిన రవి (35) అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం రాత్రి బ్రాహ్మణకొట్కూరుకు చెందిన ఆర్మపోగు రవి భారత్ పెట్రోల్ బంక్ వద్దకు బైక్‌పై వెళుతుండగా కర్నూలు నుంచి ఒంగోలు వెళుతున్న కర్నూలు 1 డిపో ఏపీ 21 జెడ్ 0696 నెంబర్ గల బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి అక్కడికక్కడే చనిపోయాడు. ఎస్సై నాగార్జున సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. మృతుడి అన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.


## యువ రైతు మృతి

**వెల్దుర్తి, జూలై, 3:** మండలంలో గుంటుపల్లె గ్రామంలో యువరైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన రామ్మోహన్ తనకున్న 4 ఎకరాల పొలంతోపాటు సూదేపల్లె గ్రామంలో 16 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. గత మూడు సంవత్సరాల నుండి వర్షాలుసరిగ్గా పడక, పంట దిగుబడులు చేతికి రాక సుమారుగా రూ.24 లక్షలు అప్పులు చేశాడు. మంగళవారం అర్ధరాత్రి దాహం కావడంతో లేచి నిద్రమత్తులో నీరు తాగి హఠాత్తుగా విగతజీవిగా పడిపోయాడు. భార్య కాలనీవాసుల సాయంతో ఆటోలో వెల్దుర్తి ఆసుపత్రికి తరలించింది. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చనిపోయిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

# సీఎంను కలిసిన గౌరు దంపతులు

- అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్ల మరమ్మతులపై చర్చ
- కల్లూరు అర్బన్ తాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి

**కల్లూరు/నందికొట్కూరు, జులై 3:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం సీఎం చంద్రబాబును వారు కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా పాణ్యం నియోజకవర్గంలోని అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతుకు చర్యలు తీసుకుని ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీర్చాలని ముఖ్యమంత్రికి వివరించారు. వెలగమాను డ్యాం నిర్మాణం, గడివేములకు బైపాస్ రోడ్డును ఏర్పాటు చేసి ప్రజలు వాహనదారుల సమస్యలను పరిస్కరించాలని కోరారు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని కల్లూరు అర్బన్ 16 వార్డులకు ప్రతిరోజూ తాగునీటి సరఫరా అందించేలా చర్యలు తీసుకుని వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబును కోరారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వంలో గడివేముల, పాణ్యం, ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో వైసీపీ నాయకులు చేసిన భూకబ్జాలు, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి

## జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లాభం రూ.1.68 కోట్లు

**కర్నూలు(అగ్రికల్చర్), జూలై 3:** ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతుల అభివృద్ధి, జీవనోపాధి మెరుగుపరిచేందుకు వివిధ రూపాల్లో రుణసదుపాయాన్ని అందిస్తున్న కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తున్నాయి. గత సంవత్సరం బ్యాంకుకు రూ.1.68 కోట్ల నికరలాభం వచ్చిందని సీఈఓ విజయకుమార్ తెలిపారు. ఇటీవల బ్యాంకు లావాదేవీలపై నిర్వహించిన ఆడిట్‌లో ఈ వివరాలను వెల్లడించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు టర్నోవర్ రూ.4 కోట్లకు పెంచాలని లక్ష్యంగా చేసుకున్నామనీ, ఇందులో భాగంగా రూ.3.920 కోట్ల వ్యాపారాన్ని సాధించామన్నారు. ఇందులో డిపాజిట్లు రూ.750 కోట్లు కాగా, అడ్వాన్సులు రూ.3.170 కోట్లు ఉందన్నారు. గత సంవత్సరం రైతులకు చేరువలోనే సహకార బ్యాంకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్యాపిలి మండలం నేరేడుచెర్ల, డోన్ మండలం ఎద్దుపెంటలో కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేశామ తెలిపారు. ఈ సంవత్సరం నంద్యాల జిల్లాలోని గోస్పాడు మండలం యాల్లూరు, బనగానపల్లె మండలం నందవరం, మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో నూతన బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామనీ తెలిపారు. బ్యాంకుకు లాభాలు రావడంపై గత సీఈఓ రామాంజనేయులు, జీఎం శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్, నాగిరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.





**జాబ్ ట్రైనింగ్**

ఒక సం॥ ట్రైనింగ్ తీసుకొని Airlines మేనేజ్‌మెంట్ లో ఎయిర్‌హోస్టెస్, గ్రౌండ్ స్టాఫ్ ఉద్యోగాలు పొందండి. మంచి జీతం. అర్హత: ఇంటర్ పాస్, డిగ్రీ (పాస్/ఫెయిల్). వివరాలకు సంప్ర: **85559 97848.**

AJL-186224

**బాడుగకు ఇవ్వబడును**

కర్నూలులోని, నందికొట్కూరు రోడ్డుకు సమీపంలోని దేవేంద్రనగర్‌లో ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌కు దగ్గరలో 4 సెంట్ల స్థలంలో నిర్మించిన 3 BHK ఇళ్లు బాడుగకు ఇవ్వబడును. H.No: 87/1364-D-N-62. Contact No : **96187 86543, 95507 74355.**

AJL-186382

**కావలెను**

క్రొత్తగా ప్రారంభిస్తున్న షాప్‌లో వెదురుతో కుర్చీలో, ఫర్నీచర్ తయారు చేసేందుకు ఇద్దరు (2) కార్పెంటర్లు కావలెను. ఎం.పుల్లయ్య. సెల్ :**62816 82613.**

AJL- 186481

**PLOT FOR SALE**

అరుణాచల గ్రీన్ సిటి కర్నూలు-డోన్ రోడ్డుకు, దూపాడు రిడ్జ్ స్కూల్ దగ్గర (30x50), (30x40) సైజు గల ప్లాట్స్ అన్ని సౌకర్యాలతో కలవు & బళ్లారి చౌరస్తా దగ్గర..3 (BHK) Flots కలవు. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. సంప్ర.**91828 21014.**

AJL-186385

**ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ ప్రతిరోజు**

**చిన్న ప్రకటన పెద్ద స్పందన**

**Contact: 99854 11369**

**బంగారం కొనబడును**

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ **7382114647**

AJA- 189272

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ / యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దాం: బైరెడ్డి


బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

**నందికొట్కూరు, జూలై 3:** నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధి కోసమే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు టీడీపీలో చేరుతున్నారని, కొత్తా పాత అన్న తారతమ్యాలు లేకుండా అంతా ఒకటై నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నందికొట్కూరు పట్టణంతో పాటు మిడ్తూరు మండలంలోని జలకనూరు, పగిడ్యాల మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీలు స్వాములు, గోపాల్‌లతో పాటు లక్ష్మాపుర గ్రామ సర్పంచ్ భర్త వెంకట్ మాజీ బైరెడ్డి సమక్షంలో బుధవారం నందికొట్కూరులో టీడీపీలో చేరారు. ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ హాజీ షేక్ అబ్దుల్ షూకూర్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం తాము కూడా టీడీపీలో చేరినట్లు ఆయన తెలిపారు. హాజీ షేక్ అబ్దుల్ షూకూర్ తో పాటు జలకనూరుకు చెందిన మహబూబ్‌బాషా, డా.మహ్మద్ రఫి, సత్తార్, ఇబ్రహీం, మియా, అలీ, షఫీ, సలాం, రహంతుల్లా, పాచమియా, అబ్దుల్ అలీమ్, నూర్ మహమ్మద్, అసిఫ్, మౌలానా, జలకనూరు తిరుపతయ్య, తదితరులు టీడీపీలో చేరారు.

**పాములపాడు:** మండలంలోని మిట్టకందాల గ్రామంలోని వైసీపీకి చెందిన దాదాపు 50 కుటుంబాలు బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం గ్రామ సర్పంచ్ చింతల నారాయణ, కోటేశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఆంజనేయులు, ఏడుగురు వార్డు మెంబర్లు తదితరులు బైరెడ్డి సమక్షంలో నందికొట్కూరులోని ఆయన నివాసంలో టీడీపీలో చేరారు.

## హైవే పనులను అడ్డుకున్న ప్రజలు


క్రిష్ణరావుపేటలో హైవే పనులను అడ్డుకుంటున్న గ్రామస్థులు

**పాములపాడు, జూలై 3:** మండలంలోని క్రిష్ణరావుపేటలో జరుగుతున్న హైవే పనులను బుధవారం గ్రామస్థులు అడ్డుకొన్నారు. గ్రామంలో భారీ వాహనాలు తిరగడం వల్ల తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయిందని తెలిపారు. అయితే మరమ్మతులు చేయాల్సిందిగా అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని కోరగా ఎలాంటి స్పందన లేదని పనులను అడ్డుకున్నారు.

## చిరుతపులి సంచారం

**మహానంది, జూలై 3:** మహానంది పరిసరాల్లోని ప్రజలను గత కొద్దిరోజులుగా నిద్రలేకుండా భయందోళనకు గురి చేస్తున్న చిరుతపులి బుధవారం క్షేత్రానికి అత్యంత సమీపంలోని నంది విగ్రహం ముందు భాగంలోని అరటితోటల్లో సంచరించింది. చెక్క చేను ఏరియాగా పిలువబడే అరటితోటల్లో చిరుతపులి పాదముద్రలను రైతులు గుర్తించారు. దీనిపై అటవీశాఖ అధికారుల దృష్టికి తెచ్చారు. వెంటనే చిరుతపులి సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇటీవల చిరుతపులి సంచారం తగ్గింది. ప్రజలు కొంత ఊపిరి పీల్చుకొన్నారు. తిరిగి క్షేత్రానికి అత్యంత సమీపంలోని అరటి తోటల్లో పాదముద్రలు కనిపించడంతో ప్రజలు, భక్తులు భయందోళన చెందుతున్నారు. రాత్రి బండిఆత్మకూరు సరిహద్దులోని కృష్ణనంది పరిసర ప్రాంతంలో బుధవారం రాత్రి చిరుత పులి సంచరించినట్లు రైతులు తెలిపారు. అరటితోటలో చిరుతపులి సంచరించిన విషయం వాస్తవమేనని ఫారెస్టు డీఆర్వో హైమావతి తెలిపారు.

## నందీశ్వరుడికి పూజలు


నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

**మహానంది, జూలై 3:** మహానంది క్షేత్రంలో మహాప్రదోషం సందర్భంగా నందీశ్వరుడికి బుధవారం సాయంత్రం నందీశ్వరాభిషేకాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ప్రధాన శివాలయం ముందు భాగంలోని నందీశ్వరుని విగ్రహానికి వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్ళ ఎల్లి అర్జునశర్మ, రాఘవేంద్రశర్మ, జనార్దన్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవదేవతాధ్యానం, పీఠాపూజానంతరం వేదమంత్రాలతో అభిషేకం, అలంకారం, అర్చనలు నిర్వహించారు.

## 'రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి'


రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

**పాణ్యం, జూలై 3:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు మద్దిలేటి, శంకరయ్య డిమాండ్ చేశారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ హిందువుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని బుధవారం పాణ్యం బస్టాండు కూడలిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జగదీశ్, శీను, సుబ్బక్రిష్ణ, సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలి'

**నంద్యాల (నూనెపల్లె), జూలై 3:** జిల్లా కేంద్రం, పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శి రాజునాయుడు డిమాండ్ చేశారు. నంద్యాలలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ ఫైనాన్స్ యాజమాన్యాలు వసూళ్ల పేరుతో ఖాతాదారులను బెదిరిస్తున్నాయని, రుణాలు ఇవ్వక ముందు ఒక వడ్డీ రేటు, వసూలు చేసేటప్పుడు మరొక రేటును వసూళ్ల చేస్తున్నారని ఆరోపించారు. ఖాతాదారుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న ఫైనాన్స్ కంపెనీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ డెమోక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవస్థలను ప్రణాళికాబద్ధంగా నడిపిస్తా

- అక్రమాలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదు
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


ఆత్మకూరు: వైసీపీ హయాంలో జరిగిన అన్యాయం గురించి ఎమ్మెల్యే బుడ్డాకు వివరిస్తున్న పొదుపు మహిళ


శింగవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

**ఆత్మకూరు, జూలై 3:** ప్రభుత్వ వ్యవస్థలను ప్రణాళికబద్ధంగా నడిపి ప్రజలందరికీ న్యాయం జరిగేలా చూస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. ఆత్మకూరులోని మండల మహిళా కార్యాలయంలో బుధవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఏరియా లెవల్ ఫెడరేషన్ లీడర్లతో పాటు రీసోర్స్ పర్సన్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రూపు లీడర్లతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడిన వారిని మాత్రం వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గత టీడీపీ పాలనలో పసుపు-కుంకుమ పథకం కింద పొదుపు మహిళలకు రూ.10వేలు ఇచ్చామని, అవకతవకలు జరిగిన గ్రూపులకు కాస్త ఆలస్యమైతే ఆ సమయంలో కొందరు పొదుపు గ్రూపు లీడర్లు చేసిన రాద్ధాంతాన్ని తాను మరచిపోలేదని అన్నారు. అలాగే ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూడా మాజీ ఎమ్మెల్యే శిల్పా ఇచ్చిన డబ్బులకు కక్కుర్తి పడి తప్పుడు ప్రచారాలు చేసిన వారెవరో తనకు తెలుసు అని అన్నారు. ఇప్పటికైనా అలాంటి వారిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇకపోతే ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే శిల్పా ప్రజల నుంచి దోచుకున్న డబ్బే గత ఎన్నికల్లో పంచారని ఆరోపించారు. ఒక్క శ్రీశైల దేవస్థానం నుంచే ఐదేళ్లలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో రూ.60 కోట్లు కాజేశారని మండిపడ్డారు. మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు కలీముల్లా, బాషా తదితరులు ఉన్నారు.

**ఉపాధ్యాయుడి మృతికి నివాళి:** ఆత్మకూరులోని తోటగేరికి చెందిన ఉపాధ్యాయుడు తోట నాగలక్ష్మయ్య మృతికి బుధవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి నివాళి అర్పించారు. నాగకిష్టయ్య, రామసుబ్బయ్య, రామ్మూర్తి, వెంకటేశ్, సతీష్, నరేష్, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

**'ప్రజా సేవకే అంకితమవుతా'**

**బండిఆత్మకూరు:** శ్రీశైలం నియోజకవర్గ ప్రజా సేవకు అంకితమవుతానని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని శింగవరం, వెంగళరెడ్డిపేట గ్రామాల్లో బుధవారం 'థ్యాంక్స్ ఫర్ ఓటింగ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభిమానంతో తనను గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సమస్యల రిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో రాజకీయకక్షలు విడనాడాలని, అభివృద్ధి వైపు దృష్టి మరల్చాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నాయకులు నరసింహారెడ్డి, చిన్న లింగారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చెన్నారెడ్డి, శంకర్‌రెడ్డి, బుగ్గరాముడు, జాకీర్, రామసుబ్బయ్య, కలాం, మల్లి, నబీరసూల్, ధనుంజయగౌడ్, వెంకటసుబ్బయ్య వెంకటాపురం శీను, రామకృష్ణ, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

## నారా లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

**నందికొట్కూరు, జూలై 3:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా విజయవాడలో కలిశారు. పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన అలగనూరు రిజర్వాయర్ మరమ్మతుల మంజూరు, నందికొట్కూరు నుంచి పగిడ్యాల వరకు డబుల్ రోడ్డు, నందికొట్కూరు నుంచి అల్లూరు వరకు 40వ అడుగుల రోడ్డు నిర్మాణం లాంటి తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. అనంతరం మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. గురుకుల పాఠశాలల్లో ప్రస్తుతం 40 మంది విద్యార్థులకే సీట్లు పరిమితంగా ఉందని, సీట్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. లోకేశ్, చంద్రబాబును కలిసిన వారిలో టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.


మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన జయసూర్య తదితరులు

## డీఎంను నిలదీసిన ప్రయాణికులు

**పాణ్యం, జూలై 3:** నంద్యాల ఆర్టీసీ డీఎం గంగాధర్‌కు పాణ్యంలో చేదు అనుభవం ఎదురైంది. బస్టాండులోని షాపుల వేలాల నిమిత్తం పరిశీలనకు వచ్చిన ఆయనపై ప్రయాణికులు, వివిధ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎం బుధవారం పాణ్యం బస్‌షెల్టర్‌కు రావడంతో సమాచారం తెలిసిన టీడీపీ, జనసేన నాయకులతో పాటు ప్రయాణికులు, ప్రజలు అక్కడకు చేరుకున్నారు. రోజూ వందలాది మంది పాణ్యం బస్టాండు నుంచి ఇతర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తుంటారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణమూర్తి చెప్పారు. విద్యార్థులు, మహిళలు నిత్యం బస్టాండునుంచి ప్రయాణిస్తున్నా కనీస సౌకర్యాలు లేవని జనసేన నాయకులు జగదీశ్ అన్నారు. మహిళలకు మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని మాజీ ఎంపీటీసీ రామగోవిందరెడ్డి డీఎంను నిలదీశారు. ఏడేళ్లుగా ఆర్టీసీ అధికారులు నిర్లక్షధోరణి వహిస్తూనే ఉన్నారని ఏఐఎఫ్‌బీ నాయకుడు వెంకటాద్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా బస్టాండు ఆవరణలో ఏర్పాటు చేసుకోవాల్సిన వ్యాపారుల నుంచి టెండర్లను కోరడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 12వ తేదీ లోపల ఆర్టీసీ స్థలంలో వ్యాపారులు స్థలాల కోసం రూ.10 వేలతో టెండరు వేయాలని బస్టాండువద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఏటా వేలాల పేరున లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నా ప్రయాణికులకు ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు కల్పించడం లేదని నిలదీశారు. కంట్రోలర్ లేక ఏ బస్సు ఎక్కడికి పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. కూర్చోవడానికి దాతలతో బెంచీలు స్థానికులే ఏర్పాటు చేసుకున్నారన్నారు. రాత్రివేళల్లో పాణ్యంలో బస్సులు ఆగకపోగా ఫ్లైఓవర్ పైనే వెళ్తూ ప్రయాణికులను అరకిలోమీటరు దూరంలో వదిలి వెళ్తున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఒక మహిళ అర్ధరాత్రి పాణ్యంలో దిగి నడుచుకుంటూ ఒంటరిగా వస్తుండగా పోలీసులు ప్రయాణికురాలిని ఇంటివద్ద వదిలారని ఇటువంటి సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని టీడీపీ నాయకులు సుభాన్ ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండులో ప్రతి రోజూ వెళ్లే ప్రతి డిపో బస్సు వివరాలు, స్టాపు వివరాలు పేర్కొనే బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నెలలోపు సమస్యలు పరిష్కారం కాకపోతే నంద్యాల ఆర్టీసీ డీఎం కార్యాలయం ముట్టడిస్తామని ప్రజలు హెచ్చరించారు. పాణ్యంలో సౌకర్యాల కోసం ఉన్నతాధికారులకు ఆరు నెలల క్రితం ప్రతిపాదనలు పంపించామని డీఎం తెలిపారు.


ఆర్టీసీ డీఎం గంగాధర్‌ను నిలదీస్తున్న ప్రయాణికులు, ప్రజలు

**నా దృష్టికి రాలేదు**

పాణ్యంలోని సమస్యలు నాదృష్టికి రాలేదు. పాణ్యంలో సమస్యలపై డీఎంను అడిగి తెలుసుకుంటాం. ఉన్నతాధికారుల అనుమతి మేరకు నిధులు, ప్రతిపాదనలు చేపట్టి పరిష్కరించాల్సి ఉంది. గతంలో వచ్చిన వినతుల గురించి తెలియదు.

- రజియా సుల్తానా, ఆర్టీసీ ఆర్ఎం, కర్నూలు

## కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ

**పగిడ్యాల, జూలై 3:** మండలంలోని ఘనపురం గ్రామానికి చెందిన బొబ్బిటి వెంకటరమణారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలులోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొంది ఆయన కూతురి ఇంటివద్ద ఉన్నారు. అనారోగ్యంతో గ్రామానికి రాలేని పరిస్థితిలో ఉన్న ఆయన పరిస్థితిని తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ శివకృష్ణ మంగళవారం రాత్రి కర్నూలుకు వెళ్లి ఆయనకు డయాలసిస్ పింఛన్ కింద మంజూరైన నగదును అందజేశారు. కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేసిన శివకృష్ణను ఎంపీడీవో కవిరాజ్ అభినందించారు.


వెంకటరమణారెడ్డి పింఛన్ అందజేస్తున్న శివకృష్ణ

## పరీక్షను రద్దు చేయాలి: ఏఐఎస్ఏ


నంద్యాలలో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఏ నాయకులు

**నంద్యాల (నూనెపల్లె), జూలై 3:** వైద్య విద్యకు కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన నీట్‌ను రద్దు చేయాలని, పేపర్ లీక్‌పై విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నారార్జున కేంద్రా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పద్మావతి నగర్ ఆర్చి వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. చేశారు. ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం జరిగే దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పవన్ సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో ఉర్దూ పాఠశాల

- వరండాలోనే తరగతులు, వంట తయారీ
- మరుగుదొడ్లు లేక విద్యార్థుల అవస్థలు
- క్రీడా మైదానం లేక ఆటలకు దూరం


వరండాలో పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయిని


వరండాలో వంట చేస్తున్న నిర్వాహకులు

**మిడుతూరు, జూలై 3:** మండలంలోని కడుమూరు మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాల సమస్యల వలయంలో చిక్కుకుంది. 3 తరగతి నుంచి 10 తరగతి వరకు 135 మంది విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వంలో నాడు నేడు కింద నాలుగు తరగతి గదులు, మరుగు దొడ్లు, వంట గది మంజూరు చేసింది. వీటిని నిర్మించేందుకు కాంట్రాక్టరుకు బిల్లులు సక్రమంగా రాక నిర్మాణంలో ఉన్నాయి. దీంతో తరగతి గదులు తక్కువగా ఉండడంతో ఉపాధ్యాయులు విద్యార్థుల వరండాలోనే పాఠాలు చెప్పాల్సిన దుస్థితి నెలకొంది. మరుగు దొడ్ల నిర్మాణంలో ఉండడం వల్ల విద్యారులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు వంట చేసేందుకు వంట గది లేక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. వరండాలోనే వంట చేస్తున్నారు. విద్యార్థులకు క్రీడా మైదానం లేకపోవడంతో చదువుకే పరిమితమయ్యారు. క్రీడలకు దూరంగా ఉంటున్నారు. ఈ పాఠశాలకు 9 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా ప్రస్తుతం ఆరుగురు మత్రమే ఉన్నారు. ఉపాధ్యాయుల కొరతతో పాటు లైబ్రరీ, ల్యాబ్ కూడా లేవు. కనీస సౌకర్యాలు లేకపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ఉర్దూ పాఠశాలకు గ్రామంలో ప్రత్యేక స్థలం ఏర్పాటు చేసి అక్కడ విద్యార్థులకు అవసరమయ్యే గదులు నిర్మించాలని, వసతులు కల్పించలని మైనార్టీలు కోరుతున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం**

తరగతి గదులు, మరుగు దొడ్లు లేక అవస్థలు పడుతున్నాం. ఉపాధ్యాయుల కొరత కూడా ఉంది. క్రీడా మైదానం లేకపోవడంతో ఆటలకు దూరంగా ఉంటున్నాం.

సానియా, విద్యార్థిని



## కార్యకర్తకు మాండ్ర పరామర్శ


కళాకర్‌ను పరామర్శిస్తున్న మాండ్ర శివానందరెడ్డి

**నందికొట్కూరు, జూలై 3:** నందికొట్కూరు పట్టణంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తను పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పరామర్శించారు. పట్టణంలోని అనారోగ్యం కారణంగా ఆపరేషన్ చేయించుకున్న 82వ బూత్ ఇన్‌చార్జి కళాకర్‌ను ఏబీఎం పాలెంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని టీడీపీ తమకుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, జాకీర్, మోహన్, రాజు తదితరులు ఉన్నారు.

## ఉపాధి పనులపై విచారణ


సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

**గోస్పాడు, జూలై 3:** జాతీయ గ్రామీణ ఉపాధి పతకం 2023 -2024 ఆర్థిక సంవత్సరంలో మండలంలో జరిగిన రూ.7 కోట్ల ఉపాధి పనులపై బుధవారం మండల స్థాయిలో ప్రజా వేదిక విచారణను అధికారులు చేపట్టారు. వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై విచారణ చేపట్టారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఆర్థర్ సైమాన్, ఎంపీడీవో నాగ అనసూయ ఆధ్వర్యంలో ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహించారు. ఈ సమావేశానికి డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్, ఏపీడీలు భాస్కర్ నాయుడు, అన్వర్‌బేగం, బాలాజీ నాయక్, ఎస్ఆర్‌పీ కాంతయ్య, ఏపీవో నాగజ్యోతి హాజరయ్యారు. మూడు గ్రామాల్లో సాంబవరం, కానాలపల్లె, నెహ్రూనగర్ గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై విచారణకు అంబుడ్స్‌మెన్‌కు నివేదించారు. కానాలపల్లిలో రూ.101209కు, సాంబవరంకు రూ.151696 అవినీతి జరిగినట్లు తెలిపారు. పసురుపాడులో రూ.18942 జరిమాన విధించారు. తేళ్ళపూరి, కృష్ణాపురం, పసురుపాడు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై పీడీ ప్రత్యేక నివేదిక ఇస్తారని తెలిపారు. కాటంరెడ్డి సుధామణి, సర్పంచ్ పరదేశి ప్రమీళమ్మ, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

**ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా:** మండలంలో ఉపాధి పథకంలో పని చేస్తున్న నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామాలు సమర్పించినట్లు ఎంపీడీవో నాగ అనసూయ తెలిపారు. రాయపాడు ఫీల్డ్ అసిస్టెంట్ నాగజ్యోతీశ్వరరెడ్డి, చింతకుంట్ల సీనియర్ మేట్ జ్యోతి, సాంబవరం సీనియర్ మేట్ నరసింహ, జిల్లెల్ల సీనియర్ మేట్ శివయ్య బుధవారం రాజీనామా పత్రాలు ఇచ్చిటన్లు తెలిపారు.

## 'సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం'


నూతన కమిటీ సభ్యులతో లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు

**నంద్యాల (నూనెపల్లె), జూలై 3:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్లు లయన్స్ క్లబ్ సీనియర్ ప్రతినిధి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు. బుధవారం నంద్యాలలోని బాలాజీ కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవలే 2024-25 సంవత్సరానికి నంద్యాల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నికల కమిటీ సభ్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ రవికృష్ణ, ఆడిటర్ గోపాల్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా నిజాముద్దీన్, కార్యదర్శిగా సిరిగిరి రమేష్, కోశాధికారిగా మామిళ్ళ నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వరప్రసాద్, సుబ్బారావు, నాగరాజు, ఉపేంద్రనాథరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా అరవేటి రాఘవేంద్ర, రామకృష్ణుడు, సీనియర్ సభ్యులను బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా, వివిధ కార్యక్రమాల కమిటీ చైర్మన్‌లుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార పత్రాలను వారు విడుదల చేశారు. ఆదివారం బాలాజీ కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకార మహోత్సవం ఉంటుందని డాక్టర్ రవికృష్ణ తెలిపారు.

## విత్తనశుద్ధి కేంద్రం తనిఖీ

**నంద్యాల టౌన్, జూలై 3:** నంద్యాలలోని మహాలక్ష్మి అగ్రో సీడ్స్ విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏవో ప్రసాదరావు బుధవారం తనిఖీ చేశారు. విత్తనాల ప్రాసెసింగ్ విధానం, ప్యాకింగ్ విధానాన్ని పరిశీలించారు. అన్ని రిజిస్టర్లను తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవడానికి ఐదు వరి విత్తన నమూనాలు తీసి ప్రయోగశాలకు పంపినట్లు ఏవో వెల్లడించారు. యజమానులందరూ కచ్చితంగా ఫౌండేషన్ సీడ్ రిజిస్టర్, బ్రీడర్ సీడ్ రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన రకాలను మాత్రమే ప్రాసెసింగ్, మార్కెటింగ్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో హెచ్చరించారు.

## 'వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి'

**ఆత్మకూరు, జూలై 3:** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, రజాక్‌లు కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ. పట్టణంలోని పారిశుధ్యం లోపించిందని అన్నారు. అనేక వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని తెలిపారు. చిన్నపాటి వర్షాలకే పట్టణంలోని అనేక వీధులు చెరువులను తలపిస్తున్నాయని వివరించారు. అదేవిధంగా పలు కాలనీల్లో తాగునీటి పైపులైన్లు సైతం లీకేజీలై కలుషితం అవుతున్నాయని తెలిపారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్న, మహమ్మద్, గణపతి, రాజేష్ తదితరులు ఉన్నారు.

## 'పోషకాల ఆధారంగా సాగు చేపట్టాలి'

**బండిఆత్మకూరు, జూలై 3:** రైతులు తమ పొలాల్లో మట్టిలో ఉన్న పోషకాల లభ్యత ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని ఏవో స్వాతి సూచించారు. బుధవారం బి.కోడూరులో మట్టి నమూనాలు సేకరించగా, పలు గ్రామాల్లో సిబ్బంది మట్టినమూనాలు సేకరించారు. అలాగే మరికొన్ని గ్రామాల్లో పచ్చిరొట్ట ఎరువుల కోసం సాగు చేసిన జీలగ మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైనందున రైతులు గ్రామాల్లో రైతు సేవా సహకార కేంద్రంలో సిబ్బంది సూచనలు ఎప్పటికప్పుడు తీసుకోవాలన్నారు. మట్టి పరీక్షల ఆధారంగా సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని సూచించారు.

## 'ఉపాధి పనులు కల్పించాలి'

**బండిఆత్మకూరు, జూలై 3:** తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శి సుబ్బరాయుడు, డేవిడ్, సీనియర్ నాయకుడు రామచంద్రుడు కోరారు. బుధవారం వారు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి ఏపీవో వసుధ, ఏవో హనీఫ్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. వలసలు ఆపాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభ్యులు శాంతయ్య, సుధాకర్, వెంకటేశ్వర్లు, తిరుపాల్, చంద్రపాల్ పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**మిడుతూరు, జూలై 3:** మండలంలోని పీరుసాహేబ్ పేట గ్రామానికి చెందిన మద్దిలేటి బుధవారం మిడుతూరు బ్రహ్మం గారి మఠం సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకుని ఆయనను మిడుతూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వచ్చి ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. ఈ ఘటనపై విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. పూర్తి విషయాలు తెలియాల్సి ఉంది.

## ప్రభుత్వ భూమి ఆక్రమణ



కోటకొండ రెవెన్యూ పరిధిలో పోరంబోకు రస్తా పొలంలో బండలు పాతిన దృశ్యం

**రుద్రవరం, జూలై 3:** మండలంలోని కోటకొండ రెవెన్యూ పరిధిలోని చిన్నయ్యస్వామి చెంచుగూడెం సమీపంలో రస్తా పోరంబోకు స్థలంలో కొందరు వ్యక్తులు బండలు పాతి కబ్జా చేశారు. ఆర్అండ్‌బీ రహదారికి సమీపంలో ఈ తతంగం జరిగింది. ప్రభుత్వ పోరంబోకు స్థలంలో బండలు పాతుతుంటే రెవెన్యూ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహించారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇలాగే అదే స్థలంలో బండలు పాతితే అప్పటి తహసీల్దార్లు ఇది పోరంబోకు రస్తా స్థలం అని బండలు తొలగించారు. తిరిగి అదే స్థలంలో బండలు పాతుతున్నా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. తహసీల్దార్ మురళీమోహన్‌ను వివరణ కోరగా సర్వే చేయించి అది పోరంబోకు రస్తా పొలంలో ఉందా? లేదా అన్నది తేలుస్తామని చెప్పారు. పోరంబోకు రస్తా పొలంలో ఉంటే తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## కాపర్ వైరు చోరీ

**ప్యాపిలి, జూలై 3:** మండలంలోని పలు గ్రామాల్లో పొలాల్లో చోరీలు జరుగుతున్నాయి. గత పది రోజులుగా దాదాపు 40 తోటల్లో మోటారుకు అమర్చిన కాపర్ వైర్లను దొంగలించుకపోతున్నారు. దీంతో రైతులు జలదుర్గం పోలీసు స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా చోరీలకు అడ్డుకట్ట పడటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గార్లదిన్నె, జలదుర్గం, మాధవరం, రామక్రిష్ణాపురం గ్రామాల్లోని పొలాల్లో కాపర్ వైరును దొంగలు చోరి చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. బోరును పైపులను పగలగొట్టి అందులో అమర్చిన కాపర్ వైను బయటికి తీసి దుండగులు అపహరించుకొని పోతున్నారని రైతులు నారాయణ, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, భాస్కర్, శివ తదితరులు వాపోతున్నారు. ఒక్కో రైతుకు రూ.10వేల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

## టైప్ రైటింగ్ పరీక్షల అర్హతలు తగ్గించాలి

**డోన్, జూలై 3:** రాష్ట్రంలో నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షల అర్హతలను తగ్గించాలని ఏపీ టైప్ రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములుగౌడ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కోట్ల నివాసంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి టైప్ రైటింగ్‌లో ఎదుర్కొంటున్న సమస్యలపై శ్రీరాములుగౌడ వినతి పత్రం అందజేశారు. టైప్ రైటింగ్ జూనియర్ గ్రేడ్, లోయర్ గ్రేడ్, హయ్యర్‌గ్రేడ్ పరీక్షల అర్హతలను తమిళనాడు విధానాన్ని అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కోట్ల సమస్యను ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తాననీ హామీ ఇచ్చారు.

## నూతన కమిటీ ఎన్నిక

**డోన్(రూరల్), జూలై 3:** డోన్ ప్రైవేటు డాక్టర్స్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డోన్ ప్రైవేటు డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంటుగా ఈర్లదిన్నె శ్రీధర్, కార్యదర్శిగా డా.రాజేంద్రప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్, సహాయ కార్యదర్శిగా డా.భార్గవ్ రెడ్డి, కోశాధికారిగా డా.ముస్కిన్‌వలి, సభ్యులుగా డాక్టర్లు రేవతి, దీపిక, కుసుమ కుమారి, సౌమ్య, రామకృష్ణలను ఎన్నుకున్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**ప్యాపిలి, జూలై 3:** మండలంలోని మెట్టుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం టీడీపీ ప్రభుత్వం అమలు చేసి స్టూడెంట్ కిట్టు పేరుతో విద్యార్థులకు బ్యాగులు, బూట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర గుప్తా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుంకన్న, విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

**కొలిమిగుండ్ల, జూలై 3:** తెలుగుదేశం పార్టీ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కొలిమిగుండ్ల మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం కొలిమిగుండ్ల ఉప సర్పంచ్ కుళ్లె పెద్దనా గయ్య, తలారి చెన్నయ్య, కుళ్లె నాగకుళ్లాయి, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, చెన్నకేశవ, సూరి, రమణ తదితరులు మండల టీడీపీ అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డిని ఘనంగా సన్మానించారు. మండలంలో టీడీపీ మెజార్టీకి సహకరించిన అందరికీ మూలే రామేశ్వరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## 'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

**చాగలమర్రి, జూలై 3:** విద్యార్థులు సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు డాక్టర్ ఇమ్రాన్ సూచించారు. బుధవారం చాగలమర్రి అజీమ్ బ్రిలియంట్ పాఠశాలలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన పోస్టర్లను చూపుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఈ వెంకటమ్మ, హెచ్‌ఎం గౌస్‌లాజమ్, శేఖర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

**ప్యాపిలి, జూలై 3:** ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చిగురుమాను మిట్ట దగ్గర ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రంలో ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు కొన్నేళ్లుగా వెట్టిచాకిరి చేస్తున్నా సరిపడ వేతనాలు చెల్లించకపోవడం బాధకరమన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. నాయకులు రామాంజినేయరెడ్డి, రమాదేవి, కోయిలకొండ నాగరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.


**VEHICLES FOR SALE**

| VEHICLE NO. | DESCRIPTION | MODEL |
|---|---|---|
| AP02Y- 8667 | MAHINDRA BOLERO MAXI TRUCK | 2014 |
| AP39VC 7029 | EICHER PRO 3019 BS6 FBT | 2023 |
| AP39TD- 3397 | MAHINDRA BOLERO PICK UP | 2019 |
| AP02BR- 3826 | MAHINDRA 415 | 2016 |
| AP39TL- 6410 | MAHINDRA BOLERO PICK UP | 2020 |

వేలము వేయు ప్రదేశం :
శ్రీరామ్ ఆటోమాల్, పంచలింగాల, NH-7, అలంపూర్ టోల్‌గేట్ దగ్గర, కర్నూలు.
వేలము వేయు తేది : 04-07-2024 (గురువారం)
98499 81427, 96667 99007.


# మూతపడ్డ మినరల్ వాటర్ ప్లాంట్

### తాగునీటి కోసం విద్యార్థుల పాట్లు

**చాగలమర్రి, జూలై 3:** చాగలమర్రిలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. 6 నుంచి పదో తరగతి వరకు 1200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులు తాగునీటి కోసం రూ.8 లక్షలు వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. మినరల్ వాటర్ ప్లాంట్‌కు సంబంధించిన విద్యుత్ మోటార్ కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచింది. దీంతో విద్యార్థులు నీటి కోసం పాట్లు పడుతున్నారు. రెండు మినీ ట్యాంకులను ఏర్పాటు చేసిన వాటి ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదు. శుద్ధజలం అందించకపోవడంతో మధ్యాహ్న భోజనం తిన్న తరువాత తాగడానికి,



ట్యాంకు వద్ద నీటి కోసం అవస్థలు పడుతున్న విద్యార్థులు



చాగలమర్రి బాలుర పాఠశాలలో మూతపడ్డ మినరల్ వాటర్ ప్లాంట్

ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి అదే నీటిని ఉపయోగించాల్సి వస్తోంది. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో మినీ ట్యాంకు నీరు సరిపోవడం లేదు. మధ్యాహ్న భోజన సమయంలో నీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేసి మంచి నీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయం గురించి పాఠశాల హెచ్‌ఎం కోటయ్యను వివరణ కోరగా మినరల్ వాటర్ ప్లాంట్ గురించి సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని చెప్పారు. 15 రోజుల నుంచి శుద్ధ జలం లేక విద్యార్థులు ట్యాంకు నీరు తాగాల్సి వస్తోందని అన్నారు. విద్యుత్ మోటార్ కాలిపోయిన విషయం తెలియజేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఎస్‌ఎంఎస్ యాప్‌లో కూడా నమోదు చేశామని తెలిపారు.

## చంద్రన్న పాలనలో పేదలకు భరోసా: ఎమ్మెల్యే కోట్ల



వినతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

**డోన్, జూలై 3:** సీఎం చంద్రబాబు పాలనలో పేదలకు ఆర్థిక భరోసా వచ్చిందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోట్లను ఆయా గ్రామాల ప్రజలు కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లా డుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. సీఎం చంద్రబాబు తన మార్పు పాలనతో నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారన్నారు. ప్రజలకు ఉచిత ఇసుకను అందించేలా సీఎం చంద్రబాబు నూతన పాలసీని అమలు చేస్తున్నారన్నారు. డోన్ నియోజకవర్గంలో నాటు సారా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా సదరం క్యాంపు స్లాట్ బుకింగ్ ప్రారంభమైందని దివ్యాంగులు, అంగవైకల్యం చెందిన వారు, డయాలసిస్ పేషెంట్లు గ్రామ, వార్డు సచివాలయాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎరుకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మనోరమ

**ప్యాపిలి, జూలై 3:** ఎరుకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ప్యాపిలికి చెందిన మనోరమ ఎన్నికయ్యారు. బుధవారం కర్నూలులో జరిగిన ఎరుకుల సంఘం నాయకుల సమావేశంలో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎరుకుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## పూదోట అవధూత స్వామి ఆరాధనోత్సవాలు

**బనగానపల్లె, జూలై 3:** పట్టణంలోని గొల్లపేటలో పూదోట గురు లింగ అవధూత స్వామి ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ సతీమణి బీసీ ఇందిరమ్మ ముఖ్య అతిథిగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకులు శివప్రసాద్ ఆచారి, శరత్ కుమార్‌లు పూర్ణకుంభంతో బీసీ ఇందిరమ్మకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో శివయ్య, బచ్చు భాస్కర్, మౌలాలి, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న బీసీ ఇందిరమ్మ

## 'రైతులకు అందుబాటులో ఉండాలి'

**చాగలమర్రి, జూలై 3:** రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఏవో రంగనేతాజీ సూచించారు. బుధవారం మూడో రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని అన్నారు.

# శిథిలావస్థలో వంతెనలు

పొంచి ఉన్న ప్రమాదాలు

**కొలిమిగుండ్ల రూరల్, జూలై 3:** ఏళ్ల కిందట నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు ప్రధాన రహదారుల్లో వంతెనలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మరోవైపు వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు కూడా లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వం రహదారులపై పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో వంతెనలు కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. ప్రధానం మండలంలోని కల్వటాల వద్ద నెల్లూరు-ముంబై హైవేలో ఎర్రవాగుపై వున్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. సైడ్ వాల్ లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదే హైవేపై వున్న బ్రిడ్జి, ఇటిక్యాల వద్ద బ్రిడ్జి, అంకిరెడ్డిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిన్నాయి. మరోవైపు పేట్నికోట, నాయినిపల్లె గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జికి సైడ్ వాల్ లేకపోవడంతో వానా కాలంలో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. తిమ్మనాయినిపేట-తాడిపత్రి రహదారిలో చింతలాయపల్లె వద్ద కల్వర్టు పూర్తిగా దెబ్బ తినింది. పెద్ద ప్రమాదాలు జరగక ముందే మరమ్మతులు నిర్వహించాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.



కల్వటాల వద్ద వంతెన లేక ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

# బనగానపల్లెలో స్పెషల్ డ్రైవ్

**బనగానపల్లె, జూలై 3:** బనగానపల్లె పట్టణంలో మురుగుకాల్వల పరిశుభ్రతకు జరుగుతున్న స్పెషన్‌డ్రైవ్ పనులను బుధవారం డీపీవో మంజులావాణి పరిశీలించారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో గ్రామ పంచాయతీ అధికారులు గత 5 రోజులుగా స్పెషల్ కార్యక్రమాలు చేపట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో బనగానపల్లె పట్టణంలో మురుగు కాల్వలు అధ్వానంగా ఉండేవి. వైసీపీ నాయకులు గాని అధికారులు గాని డ్రైనేజీ కాల్వలను పట్టించుకున్న పాపాన పోలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లు భవనాల శాఖామంత్రిగా బీసీ జనార్దన్‌రెడ్డి పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో పట్టణంలో కాల్వల పరిశుభ్రత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎక్స్‌కవేటర్‌తో మురుగు చెత్తను తొలగిస్తున్నారు. అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం గాని, పాలకులు గాని పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో పట్టణంలో ఎక్కడ చూసినా మురుగుకాల్వలు పరిశుభ్రం చేయకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడేవారు. అయితే మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గత శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని ఈద్గానగర్‌లో అధ్వానంగా ఉన్న మురుగు కాల్వలను తనిఖీ చేసి అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉందని మండి పడ్డారు. ఈ నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 10 రోజుల్లో బనగానపల్లె పట్టణంలో మురుగు కాల్వల్లో పూడికతీత పనులు పూర్తి చేయడానికి సిబ్బంది శ్రమిస్తున్నారు. ఇందుకోసం ప్రతి రోజు 150 మంది పారిశుధ్య సిబ్బందితో పట్టణంలో మురుగు కాల్వల పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. బనగానపల్లె పట్టణంలో పరిశుభ్రత కోసం కొత్తవాహనాలు త్వరలో రానున్నాయి.



ఎక్స్‌కవేటర్‌తో మురుగు కాల్వలోని చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

## 'చంద్రబాబు పాలనతో ప్రజలకు భరోసా'



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

**చాగలమర్రి, జూలై 3:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థవంతమైన పాలనతో ప్రజలకు భరోసా వచ్చిందని మాజీ జడ్పీటీసీ నాగమ్మ, టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, పుల్లయ్య అన్నారు. బుధవారం మల్లేవేముల గ్రామంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరిచి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చాలి: డీవైఎఫ్ఐ

**డోన్(రూరల్), జూలై 3:** టీడీపీ కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నక్కి హరి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లకు రూ.10 వేలు వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో లక్షలాది మంది వాలంటీర్లను బలవం తంగా ఒత్తిడి చేసి అప్పటి పాలకులు రాజీనామాలు చేయించారన్నారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

## 'ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి'

**చాగలమర్రి, జూలై 3:** గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల సూచించారు. బుధవారం చాగలమర్రి ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కిట్లు అందజేయాలన్నారు. గత ఏడాది విద్యాకానుక తీసుకొని బయోమెట్రిక్ వేయని పిల్లలకు సంబంధించిన తగిన కారణాలను సమర్పించాలని సూచించారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## 'విధులు సక్రమంగా నిర్వర్తించాలి'

**రుద్రవరం, జూలై 3:** సచివాలయాల్లో సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ అన్నారు. మండలంలోని ముత్తలూరు సచివాలయాన్ని బుధవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పాములేటి, సిబ్బంది ఉన్నారు.

## సెలవుపై ఎస్ఐ నిరంజన్‌రెడ్డి

**రుద్రవరం, జూలై 3:** రుద్రవరం పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సెలవుపై వెళ్లినట్లు ఏఎస్ఐ శోభన్‌బాబు బుధవారం తెలిపారు. ఇన్‌చార్జిగా తనను నియమించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ముందు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ నుంచి ఎమ్మిగనూరు వెళ్లి తిరిగి రెండోసారి ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఎస్ఐ సెలవుపై వెళ్లినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ సీతారామయ్య

**కొలిమిగుండ్ల, జూలై 3:** మండలంలోని వివిధ గ్రామాల్లో వైసీపీ నాయకులు అక్రమంగా 200ఎకరాలకు పైగా భూములను అన్‌లైన్ చేసుకున్నారని, వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ సీతారామయ్య, జనసేన మండల అధ్యక్షులు గుజ్జల పెద్దయ్య డిమాండ్ చేశారు. సర్వే నెంబర్- 112సి, 442 తదితర ప్రాంతాల్లో కొలిమిగుండ్ల, కల్వటాల వైసీపీ నాయకులు బీనామీ పేర్లతో భూములు కొల్లగొట్టారని, దీనికి అప్పటి రెవిన్యూ అధికారులు, సిబ్బంది సహకరించారని ఆరోపించారు. కొలిమిగుండ్ల, ఇటిక్యాల, మీర్జాపురం, పేట్నీకోట గ్రామాల పరిధిలో వైసీపీ నాయకులు బీనామీ పేర్లతో ఈ అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. అధికారులు వెంటనే దీనిపై చర్యలు తీసుకొని, భూములు తిరిగి స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామేశ్వరరెడ్డి, వెంకటరమణ, టి.రమణమూర్తి, ప్రతాప్, రాజా, శీను తదితరులు పాల్గొన్నారు.

## కారులో మంటలు

**నంద్యాల, జూలై 3(ఆంధ్రజ్యోతి):** హైదరాబాదు నుంచి తిరుపతికి వెళ్తున్న కారులో ఆళ్లగడ్డ శిల్పకళామందిరాల వద్ద బుధవారం మంటలు చెలరేగాయి. దీంతో చుట్టు పక్కల వారంతా వచ్చి మంటలను అదుపు చేస్తూనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పి వేశారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురు క్షేమంగా బయటపడ్డారు.

## నేడు వారపు సంత మార్కెట్ వేలం

**కొలిమిగుండ్ల, జూలై 3:** కొలిమిగుండ్లలో వారపు సంత మార్కెట్ నిర్వహణకు వేలం పాట గురువారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు వెల్లడించారు. కొలిమిగుండ్లలోని శివాలయం ఆవరణలో గురువారం సాయంత్రం వేలం పాటలు నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వారు రూ.20వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు సుధాకర్

**కోవెలకుంట్ల, జూలై 3:** ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకుడు సుధాకర్ డీలర్లకు సూచించారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో డీలర్లతో ఏడీఏ సుధాకర్, ఏవో నిరంజన్ సమావేశం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ రైతులకు అదీకృతమైన, నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే అమ్మాలని అన్నారు.

## మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు

**బనగానపల్లె, జూలై 3:** మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.2లక్షలతో కొత్తపరికరాలు ఏర్పాటు చేసి మినరల్ వాటర్ ప్లాంట్‌ను టీడీపీ నాయకుడు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వరరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఉపసర్పంచ్ మాట్లాడుతూ 2015లో ఎమ్మెల్యేగా ఉన్న బీసీ జనార్దన్‌రెడ్డి మినరల్ వాటర్ ప్లాంట్‌ను సొంత డబ్బులతో ఏర్పాటు చేశారన్నారు. 2019 వరకు ప్రజలకు మినరల్ వాటర్‌ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన నీరు ప్రజలకు అందిందని అన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ వైసీపీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడి మినరల్ వాటర్‌ప్లాంట్‌ను స్వాధీనం చేసుకొని గ్రామస్థులకు మినరల్ నీటిని అందకుండా చేశారని విమర్శించారు. దీంతో గ్రామంలోని ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. బీసీ మంత్రి అయిన వెంటనే గ్రామ ప్రజలకు నాణ్యమైన మినరల్ వాటర్ అందించాలని రూ. 2 లక్షల విలువ గల పరికరాలను మార్పించి ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. నాయకులు బండి మల్లేశ్వరరెడ్డి, నంద్యాల నాగేశ్వరరెడ్డి, సోమన్నగారి శంకర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, దూదేకుల కాశీం పాల్గొన్నారు.

## ప్రారంభమైన మహా సంప్రోక్షణ

**నంద్యాల, జూలై 3(ఆంధ్రజ్యోతి):** దిగువ అహోబిలంలో బుధవారం నుంచి లక్ష్మీనరసింహస్వామి జీర్ణోద్ధరణ, అష్టబంధన, మహాసంప్రోక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు 7వ తేదీ వరకు పీఠాధిపతి రంగ నాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ప్రధాన అర్చకుడు వేణుగోపాలన్ తెలిపారు.

**కళారాధన:** దిగువ అహోబిలంలో విద్వాంసులు కళారాధన కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రవీణ, నాదస్వరం తదితర కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమాల్లో పిగణేష్, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, శివరామ్, గణేషన్, విద్వాంసులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు కొనుగోలు చేయాలి'

**చాగలమర్రి, జూలై 3:** మండలంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ పాఠ్యపుస్తకాలనే కొనుగోలు చేయాలని ఎంఈవో అనూరాధ సూచించారు. బుధవారం చాగలమర్రి ఎమార్సీ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాతూ అన్ని పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వం నుంచే పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేయాలని, 5 శాతం అడ్వాన్స్ చెల్లించాలని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేయకూడదని, పాఠ్యపుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా వసూలు చేయకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో న్యామతుల్ల, సీఆర్పీలు పాల్గొన్నారు.

## వరి ధాన్యం నిల్వ చేసుకోవడానికి రైతులకు అవకాశం

**నంద్యాల, జూలై 3(ఆంధ్రజ్యోతి):** ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ కమిటీలోని గోదాముల్లో రైతులు వరి ధాన్యం నిలువ ఉంచుకునేందుకు అవకాశం కల్పించామని కార్యదర్శి నారాయణస్వామి బుధవారం చెప్పారు. ఇప్పటికి 19 మంది రైతులు వరి ధాన్యాన్ని నిలువ ఉంచుకున్నారని, వీరు బస్తాకు నెలకు రూ.2 చెల్లించాలని చెప్పారు. అయితే వీరికి రైతు బంధు పథకం కింద రుణాలు ఇచ్చేందుకు నిధులు లేవన్నారు.

## కౌలు పత్రాల కోసం దరఖాస్తు చేసుకోండి

**బేతంచెర్ల, జూలై 3:** ఖరీఫ్ సీజన్‌లో కౌలుకు పొలం తీసుకుని సాగు చేస్తున్న రైతులు కౌలు పత్రాల కోసం వెంటనే రైతుసేవా కేంద్రంలో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఏవో కిరణ్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు పత్రాల ద్వారా బ్యాంకులో పంట రుణాలు, పంట నమోదు, పంట బీమా, పంట నష్టపరిహారం పొందవచ్చని అన్నారు. ఏఈవో బన్నిరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ యశోద, భారతి పాల్గొన్నారు.

## ముదిగేడులో కనీస సౌకర్యాలు కల్పించండి

**సంజామల, జూలై 3:** ముదిగేడు గ్రామ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని టీడీపీ నాయకుడు సోముల రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకుడు సోముల రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ, నాయకులు, కార్యకర్తలతో కలసి బుధవారం ఎంపీడీవో విజయకుమార్‌రెడ్డికి వివరించారు. గ్రామ సర్పంచ్ గ్రామానికి రెండు నీరు సరఫరా చేయకపోతే తాను సొంత డబ్బుతో గ్రామానికి నీటిని సరఫరా చేశామన్నారు. నియోజకవర్గం మైనార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్, మహేంద్రారెడ్డి, విశ్వనాథరెడ్డి, తలారి నరేశ్, గిరీశ్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపాలు ఉన్నారు.